క్లుప్తంగా

పనిదినాలు ప్రామాణికం సరికాదు

ములకలపల్లి: ఉపాధి హామీ పథకంలో యేడాదిలో కనీసం 20 రోజులు పని చేస్తేనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అర్హులుగా ప్రభుత్వం ప్రకటించడం సరికాదని బీజేపీ మండల అధ్యక్షుడు గుగులోతు శంకర్ నాయక్ అన్నారు. ములకలపల్లిలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ పథకంలో ఏడాదికి నిరుపేద కూలీలకు రూ.12 వేలు అందజేస్తామని హామీ ఇచ్చి, గద్దెనెక్కిన పాలకులు ఇప్పుడు మాట మారుస్తున్నారని విమర్శించారు. కొర్రీలు పెట్టి లబ్ధిదారుల సంఖ్య తగ్గించే కుటిల యత్నాలకు పాల్పడతోందని ఆరోపించారు.

పేదలందరికీ ఆత్మీయ భరోసా అందించాలి

బూర్గంపాడు: భూమిలేని పేదలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ డివిజన్ నాయకుడు డి.పున్నంచంద్ డిమాండ్ చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ప్రభుత్వం ఉపాధిహామీ పథకం జాబ్ కార్డు, పనిదినాలను పరిగణనలోకి తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయటం సరైన విధానం కాదని అభిప్రాయపడ్డారు. చాలామంది పేదలకు జాబ్‌కార్డులు లేవని,కొంతమంది ఉపాధి హామీ పనులకు కాకుండా వ్యవసాయ పనులకు, ఇతర పనులకు వెళ్లేవారికి ఈ పథకంలో అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. లబ్ధిదారులను తగ్గించేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు.

బియ్యం వితరణ



బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం

భద్రాచలంటౌన్: పట్టణంలోని పరివర్తన యశోద ఫౌండేషన్ సేవ సమితి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మొదటి వార్షికోత్సవంలో భాగంగా వికలాంగులు, వృద్ధులతో పాటు పేదలకు బియ్యం పంపిణీ, అన్నదానం కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే తెల్లం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టాన్ని కూడా సంతోషంగా అందరికీ తమకున్న దాంట్లో పంచిపెట్టడం ప్రతి ఒక్కరికి ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో కొమ్మ గిరి వెంకటేశ్వర్లు, డాక్టర్ భాను ప్రసాద్, రమాకాంత్, వెంకట్ రెడ్డి, జిందా, రాజీవ్, శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాసరావు, అలవాల రాజా పెరియార్ పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలి

మణుగూరుటౌన్: కాంట్రాక్ట్ కార్మికులు చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నారని, హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేసే వరకు జీఓ 22 ప్రకారం వేతనాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ కార్యదర్శి ఆదర్ల సురేందర్ డిమాండ్ చేశారు. సోమవారం కేసీహెచ్‌పీలో కాంట్రాక్ట్ కార్మికుల సమావేశం నిర్వహించి ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి ఆదర్ల సురేందర్, యూనియన్ ఆఫీస్ బేరర్ జీఎం కమిటీ సభ్యులు ఆవుల నాగరాజు మాట్లాడుతూ.. గతంలో అంగీకరించిన డిమాండ్‌లు అమలు చేయాలని ఈ నెల 24న సాయంత్రం 4గంటలకు మణుగూరు జీఎం కార్యాయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మిట్టపల్లి వెంకటేశ్వర్లు, రత్నం, అవినాష్, అడబాల ప్రవీణ్ ఉన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మణుగూరురూరల్: మండల పరిధిలోని రామానుజవరం గ్రామపంచాయతీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పంచాయతీ స్పెషల్ ఆఫీసర్, మణుగూరు తహసీల్దార్ వి.రాఘవరెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ యాప్‌లో కొంతమంది అర్హుల పేర్లు రాలేదని, వెంటనే వారి పేర్లను యాప్‌లో పొందుపర్చాలని అన్నారు. ఇల్లు లేని వారిని నిష్పక్షపాతంగా ఎంపిక చేయాలన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు అక్కి నర్సింహరావు, ప్రభుదాస్, యువజన నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నివాళి అర్పించిన ఎమ్మెల్యే

దుమ్ముగూడెం: మండలంలోని మారేడుబాక గ్రామంలో జరిగిన దశదిన కర్మలకు భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సోమవారం హాజరయ్యారు. గత కొన్ని రోజుల క్రితం మృతిచెందిన మారేడుబాక గ్రామానికి చెందిన కుంజా రామచిట్టి దశదిన కర్మలకు హాజరై చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. అలాగే మునలిమడుగు గ్రామంలో మృతి చెందిన వాగే మంగయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కుంజా శ్రీనివాసరావు, వర్ష శివరామకృష్ణ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభల్లోనే లబ్ధిదారుల ఎంపిక

- నాలుగు పథకాల అమలుకు కార్యాచరణ
- దళారులను నమ్మి మోసపోవద్దు
- ఎమ్మెల్యే పాయం, జారే సూచన



మణుగూరుటౌన్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



అశ్వారావుపేటరూరల్: సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే జారే..

అశ్వారావుపేటరూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంలో నాలుగు గోడల మధ్య తీసుకునే నిర్ణయాలు ఉండవని, లబ్ధిదారులను గ్రామసభల్లోనే ఎంపిక చేస్తామని స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. సోమవారం మండలంలోని మారుమూల అటవీ ప్రాంతంలోని మొద్దులమడ, కోయ రంగాపురం గ్రామ పంచాయతీల్లో పర్యటించి, ఆయా జీపీల్లో రూ.40లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించారు. అనంతరం గ్రామస్తులతో సమావేశాలను నిర్వహించి ఈ నెల 26వ తేదీ నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న నాలుగు పథకాల గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా విద్య, ఆరోగ్యంపై కుడా ప్రత్యేక శ్రద్ధ పెట్టామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, సొసైటీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, ప్రమోద్, ఎస్‌కే బాబా, ఫణి పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం ఈ నెల 26వ తేదీన ఏకకాలంలో నాలుగు పథకాలు ప్రారంభించబోతోందని, అర్హుల ఎంపిక బాధ్యత గ్రామసభల్లో ద్వారా ప్రజలదేనని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి సర్వే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ నెల 21 నుంచి 24 వరకు గ్రామ సభల ద్వారా అర్హులను గుర్తించి అర్హులందరికీ 26 నుంచి నాలుగు పథకాలు అందించేందుకు ప్రభుత్వం రూపకల్పన చేసిందన్నారు. ప్రజాపాలన, కులగణనల ఆధారంగా వచ్చిన రిపోర్టుల ఆధారంగా అధికారులు సర్వే నిర్వహించి గ్రామసభల్లో అర్హులను గుర్తించడం జరుగుతుందని, ఇది నిరంతర ప్రక్రియ అన్నారు. పేర్లు రాని వారు అధైర్యపడాల్సిన పనిలేదని గ్రామ సభల్లో అధికారులకు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అపోహలకు పోవద్దని, మధ్యవర్తులను ఆశ్రయించి గందరగోళానికి గురికావొద్దని సూచించారు. మండల అధ్యక్షుడు పి.నవీన్, పట్టణ అధ్యక్షుడు శివసైదులు, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు తరుణ్‌రెడ్డి, కూచిపూడి బాబు, సామా శ్రీనివాసరెడ్డి, పాతూరి వెంకన్న, కోటేశ్వరరావు, రహీం, కూరపాటి సౌజన్య, గణేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలి

దుమ్ముగూడెం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలుచేయబోయే సంక్షేమ పథకాల అమలు కోసం ఏర్పాటు చేయనున్న గ్రామ సభలను లబ్ధిదారుల సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో కోరారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయబోయే రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల జాబితాపై 21వ తేదీ నుంచి 24 వరకు అర్హులైన వారి జాబితాపై గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామసభలలో ప్రజలు పాల్గొని లబ్ధిదారుల ఎంపిక సక్రమంగా జరిగేందుకు సహకరించాలన్నారు.

అశ్వారావుపేటరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించిన అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామ పంచాయతీల వారిగా నేటి నుంచి గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీఓ ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం గ్రామసభల షెడ్యూల్ విడుదల చేశారు. ఆయా గ్రామసభలకు ప్రజలు హాజరై ఆయా పథకాలకు దరఖాస్తులు అందించాలని ఎంపీడీఓ కోరారు.

చర్ల: ఇందిరమ్మ ఇళ్లు రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఎంపికకు సంబంధించి మంగళవారం నుంచి గ్రామసభలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఈదయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసిన వారితో పాటు ఆయా గ్రామ పంచాయితీలలోని ప్రజలంతా హాజరవ్వాలని సూచించారు. సభల్లో లబ్ధిదారులకు సంబంధించి అభ్యంతారాలు ఉంటే తెలియజేయాలని ఆయన కోరారు.

రోడ్డుభద్రత మాసోత్సవ ర్యాలీ



చంద్రుగొండ: జాతీయ రహదారిపై మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

చంద్రుగొండ: మండలకేంద్రం చంద్రుగొండలో రోడ్డుభద్రత మాసోత్సవ ర్యాలీ సోమవారం నిర్వహించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ర్యాలీ అనంతరం జాతీయ రహదారిపై మానవహారం ఏర్పాటు చేశారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత నియమ, నిబంధనలు పాటించాలని, తద్వారా ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ఎస్‌ఐ శివరామకృష్ణ చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న, ఎఫ్ఆర్ఓ ఎల్లయ్య, జెడ్పీ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

మణుగూరురూరల్: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మణుగూరు ఎస్సై మేడ ప్రసాద్ సూచించారు.జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మణుగూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మణుగూరు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మేడ ప్రసాద్ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు అన్ని అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మణుగూరు ఎస్సై రంజిత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ విజయలక్ష్మి

భద్రాచలంఅర్బన్: ప్రయాణాలు చేస్తున్న సమయంలో రోడ్డు భద్రతపై వాహనదారులు ప్రజలు, విద్యార్థులు వాహనాలు నడిపే సమయంలో ట్రాఫిక్ రూల్స్‌పైన అవగాహన కలిగి ఉండాలని భద్రాచలం టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు ఎస్‌ఐ విజయలక్ష్మి తన సిబ్బందితో కలిసి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టౌన్ ఎస్‌ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ.. రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. కార్యక్రమం స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బంది తో పాటుగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదలకు ఇవ్వాలి



నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బూర్గంపాడు: గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను పేదలకు పంచాలని సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. చెరువు సింగారం గ్రామంలో గత ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను సోమవారం ప్రతినిధి బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు మూడేళ్ల క్రితం నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు విద్యుత్, తాగునీరు, రహదారుల సౌకర్యం కల్పించలేదన్నారు. నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లలో పిచ్చిచెట్లు, కంచె చెట్లు మొలిచి శిథిలావస్థకు చేరుతున్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గ్రామంలోని పేద ఆదివాసీలకు ఈ ఇళ్లను కేటాయించి వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. చెర్పా సత్యనారాయణ, చిన్నరాజు, తాటి తిరుపతయ్య, ఉడయం శ్రీను, పెద్దరాజు పాల్గొన్నారు.

రేడియం స్టిక్కర్లు తప్పనిసరి



ట్రాక్టర్‌కు రేడియం స్టిక్కర్లు అతికిస్తున్న ఎంవీఐ జనార్దన్ రెడ్డి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా వాహనాలకు తప్పనిసరిగా రేడియం స్టిక్కర్లు ఉండాలని ఎంవీఐ జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా స్థానిక సరిహద్దు రవాణా శాఖ చెక్‌పోస్టు వద్ద వాహనదారులకు, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాత్రి వేళలో జరిగే రోడ్డు ప్రమాదాలకు వాహనాలకు రేడియం స్టిక్కర్లు లేకపోవడం కుడా కారణమన్నారు. రేడియం స్టిక్కర్లు లేని వాహనాలను గుర్తించి తన సిబ్బందితో కలిసి వాటికి స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు ప్రవీణ్ కుమార్, క్రాంతి కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ర్యాలీ



దమ్మపేటలో ర్యాలీ చేస్తున్న సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు, కార్యకర్తలు

దమ్మపేట: మండలంలోని మల్లారం శివారులో అసంపూర్తి డబుల్ బెడ్రూమ్ నిర్మాణాలను ఆవాసాలుగా మార్చుకున్న నిరుపేదలను బలవంతముగా ఖాళీ చేయించిన ప్రభుత్వం, వారికి వెంటనే ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ జిల్లా నాయకులు అమర్లపూడి రాము సోమవారం డిమాండ్ చేశారు. మండలంలోని నిరుపేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు, మహాలక్ష్మి, జీవన భృతి తదితర సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరుతూ, మండల కేంద్రం నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, కాసేపు నిరసన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వాణికి అందజేశారు. ఈ సందర్భంగా మాస్‌లైన్ నాయకులు అమర్లపూడి రాము, గోకినపల్లి ప్రభాకర్‌లు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని తూచ తప్పకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు తొడెం దుర్గమ్మ, వీరబాబు, ప్రసాద్, అనిల్‌కుమార్, ముత్తేశ్వరి, నాగవల్లి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం, మల్లెలమడుగు గ్రామాల్లో సోమవారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పర్యటించి పలువురు కుటుంబాలను పరామర్శించారు. రామచంద్రాపురం గ్రామంలో ఇటీవల మృతి చెందిన మద్ది శంకర్‌రెడ్డి దశదినకర్మకు హాజరై వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. తాటి చెట్టు పైనుండి పడి రెండు కాళ్లు విరిగిన కొండా వీరయ్యను రేగా కలిశారు. మల్లెలమడుగు గ్రామంలో ఎస్టీ కాలనీలో ఇటీవల ఆదివాసీ నాయకుడు కుంజా శ్రీను మృతి చెందగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎస్సీ కాలనీకి చెందిన జినక ప్రభాకర్ అనారోగ్యంతో బాధపడుతుండటంతో ఆయన నివాసంలో ప్రభాకర్‌తో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి అమరేందర్, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కంచుగట్ల వీరభద్రం, యూత్ మండల అధ్యక్షుడు గద్దల రామకృష్ణ, నాయకులు కందుల కృష్ణార్జునరావు, మోగిళ్ల వీరారెడ్డి, గుంపెన శ్రీను, మేడవరపు సుధీర్, నక్కనబోయిన పాపారావు, సురేష్‌రెడ్డి, సురేందర్, కృష్ణ, మామిడి శ్రీను, డాక్టర్‌బాబు, మందా హుస్సేన్, పున్నారావు పాల్గొన్నారు.

నిలువ నీడ లేదాయే..



ఎండలో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

అశ్వాపురం: మండల కేంద్రంలో బస్టాండ్ లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన సెంటర్‌లో గతంలో రెండు చెట్ల కింద సిమెంట్ బల్లలపై కూర్చొని, చెట్టు కింద నిలబడి ప్రయాణికులు బస్సులు ఎక్కేవారు.

గత రెండు రోజుల క్రితం రహదారి విస్తరణకు అడ్డు వస్తాయని మండల కేంద్రంలో ప్రధాన రహదారి వెంబడి పెద్ద పెద్ద చెట్లు కొట్టేశారు. దీంతో అప్పటివరకు నీడనిచ్చిన చెట్లు లేక ప్రయాణికులకు నిలువ నీడ లేకుండా పోయింది. ఎండలో బస్సుల కోసం నిలబడి వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నీడ కోసం షెల్టర్ ఐనా నిర్మించాలని ప్రయాణికులు, మండల కేంద్ర ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

భద్రాచలం సీఐగా రమేష్



భద్రాచలంఅర్బన్: భద్రాచలం టౌన్ సీఐగా భారపాటి రమేష్‌ను నియమిస్తూ తెలంగాణా మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ప్రస్తుతం భద్రాచలం సీఐగా ఉన్న సంజీవరావును ఐజీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆయనకు ఆదేశాలు అందాయి. కాగా సంజీవరావు గత ఏడాది 2024 మార్చి 2న భద్రాచలం టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించారు.

22న ఐక్యత సభ

గుండాల: ప్రగతిశీల యువజన సంఘంలోని రెండు వర్గాలు ఈనెల 22వ తేదీన యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో వీలీనమవుతున్నాయని, ఈ సభకు యువకులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి మోకాళ్ల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి పరిశ్క రవి పిలుపునిచ్చారు. సోమవారం గుండాల మండల కేంద్రంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు చింత నరసింహారావు, జిల్లా సహాయ కార్యదర్శి సోముల బాసు చందర్, వాంకుడోత్ మోతిలాల్, అర్.ఉపేందర్, అట్టికం శేఖర్, తాటి రమేష్, లాజర్, ప్రమోద్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జారే నివాళి

దమ్మపేట: మండలంలోని నాచారం గ్రామానికి చెందిన కోడెల బాలరాజు మాతృమూర్తి నీలమ్మ సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందగా.. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మృతురాలి భౌతిక కాయాన్ని సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పలువురికి పరామర్శ..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారాయణపురం గ్రామంలో సోమవారం రాత్రి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పర్యటించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ.. మృతి చెందిన పడాల వెంకటేశ్వరరావు, పిడక అర్జున్, బలమూరి పాపా కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు తుమ్మా రాంబాబు, జూపల్లి రమేష్, సుంకవల్లి వీరభద్రరావు, జూపల్లి ప్రమోద్, నులకాని శ్రీను, పసుపులేటి నరేష్, చిన్నంశెట్టి నాగేంద్ర కుమార్, పి.కొండయ్య, శివ, చందా రామారావు, వెంకటప్పయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

మెట్ల ఏర్పాటుపై హర్షం

మణుగూరుటౌన్: అంబేద్కర్ కూడలి వద్ద సింగరేణి ఆధ్వర్యంలో తమ విజ్ఞప్తి మేరకు విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం జీఎం దుర్గం రాంచందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పున్నం భిక్షపతి, పట్టణ మాజీ అధ్యక్షుడు లింగంపల్లి రమేష్‌లు మాట్లాడుతూ.. జీఎంకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా శాలువాతో సన్మానించారు. నాయకులు బీర రమేశ్, కిశోర్ బాబు, నారాయణమూర్తి, పావని ఉన్నారు.

అభివృద్ధి పనులు చేపట్టాలి

మణుగూరురూరల్: మండల పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామాలైన ఖమ్మం తోగు, బుగ్గ, బుడుగుల, రేగులగండి, రాయన్నపేటలలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఇఫ్టూ నాయకులు, సామాజిక కార్యకర్త ఎస్‌డి.నాసర్‌పాషా కోరారు. సోమవారం ఈ మేరకు భద్రాచలం ఐటీడీఏ పీఓ బి.రాహుల్‌కు ఆయన సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాసర్‌పాషా మాట్లాడుతూ.. పినపాక నియోజకవర్గ పరిధిలోని మణుగూరుతో పాటు అశ్వాపురం, పినపాక మండలాల్లోని పలు ఆదివాసీ గిరిజన గ్రామాల్లో నేటికీ మౌలిక వసతులు లేవని, ఆయా ఆయా సౌకర్యాలు కల్పించాలని పీఓను కోరారు. కార్యక్రమంలో నాగులజ్యోతి, ఆదివాసీ నాయకులు శ్రీను, శ్యామల రాజు పాల్గొన్నారు.

ఎలక్ట్రీషియన్ల మండల అధ్యక్షుడిగా ఆసిఫ్



మాట్లాడుతున్న నూతన అధ్యక్షుడు ఆసిఫ్

చంద్రుగొండ: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ మండల అధ్యక్షుడిగా ఎస్‌కె.ఆసిఫ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనియన్‌కు గుర్తింపు లభించిన నేపథ్యంలో సోమవారం ఎలక్ట్రీషియన్‌లు సమావేశమై నూతన కమిటిని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా దెబ్బెందుల బాబురావు, కార్యదర్శిగా మన్నెం వీరేంద్రప్రసాద్, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కె.అహెమద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్‌కె.ఆబీద్, సభ్యులుగా ఎస్‌కె.షావలీ, పిట్టల రాంలక్ష్మణ్, కాకటి లక్ష్మణ్, బాదావత్ రమేష్, చారీలను ఎన్నుకున్నారు.

క్షయపై అవగాహన

మణుగూరురూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంలో నిర్వహిస్తున్న వంద రోజుల నిక్షయ్ షివిర్ ముమ్మర కృషి కార్యక్రమంలో భాగంగా మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం కొండాయిగూడెం గ్రామంలో క్షయవ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. 15రోజులకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గిపోవడం, ఆయాసం, అలసట, తేమడలో రక్తం పడడం, మెడ చుట్టూ, సంకలో గడ్డలు వంటి ప్రధాన లక్షణాలు ఉన్నట్లయితే వారు వెంటనే క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తగు మందులు, సూచనలు పాటిస్తే వ్యాధిని నివారించవచ్చన్నారు. పోషకాహార నిమిత్తం బాధితునికి మందులు వాడే కాలనికి ప్రతీ నెల రూ.వెయ్యి ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, కృష్ణ, దమయంతి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గ్రామశాఖ అధ్యక్షుడిగా మంగపతి

ములకలపల్లి: కాంగ్రెస్ పార్టీ ములకలపల్లి గ్రామ పంచాయతీ శాఖ అధ్యక్షుడిగా పువ్వాల మంగపతి నియమితులయ్యారు.మండలకేంద్రంలో సీనియర్ నాయకుడు డాక్టర్ గోపి అధ్యక్షతన సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా మంగపతి, కార్యదర్శిగా గాడి తిరుపతిరెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులను పార్టీ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ జెడ్పీటీసీ దుశ్శాలువ కప్పి సత్కరించారు. నాయకులు కరుటూరి కృష్ణ, షేక్ ఖాదర్‌బాబా, మేకల పెద్ద వెంకన్న, శనగపాటి అంజి, దుగ్గి సంపత్, ఎండి.జహీర్, శ్రీరాముల నాగేశ్వరరావు, వల్లెపు మహేశ్, ఈర్ల మహేశ్వరరావు, ముదిగొండ శ్రీను, మేకల రాజేశ్, మిర్యాల అవినాశ్, గణపతి పాల్గొన్నారు.

దాడి చేసిన దుండగులను శిక్షించాలి



గుండాల: నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉపాధ్యాయులు

దుమ్ముగూడెం: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబాలపల్లి రాములుపై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.రాజు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఆర్లగూడెం గ్రామంలోని ఏహెచ్‌ఎస్ పాఠశాలలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు రక్షణ చర్యలు చేపట్టాలని, పాఠశాలలను కుల మత, వర్గ రహిత కేంద్రాలుగా ఉండేట్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మండల ప్రధాన కార్యదర్శి రవి, టీపీటీఎఫ్ కమిటీ కన్వీనర్ రామచంద్ర, ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుండాల: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ పాఠశాల హెచ్‌ఎం రాములపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జోగ రాంబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో ఆళ్ళ పల్లి మండలంలో పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులు హాజరై నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలోని 23 ఉపాధ్యాయ సంఘాలు నిరసనకు పిలుపునిచ్చిన సందర్భంగా ఎంఈఓ కొమరం శాంతారావు, ఏటీపి రాష్ట్ర నాయకులు ముడిగ సమయ్య, తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు, జోగ రాంబాబు, యూటీఎఫ్ మండల నాయకులు, పీఆర్‌టీయూ ఉపాధ్యాయులు వీరన్న, బాలాజీ, వెంకటేశ్వర్లు, కోటేశ్వరి, మండల విద్యా వనరుల సిబ్బంది సర్వేష్, రామయ్య చైతన్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.